



# అపార్థం



ఎమ్. హరా

"అదీ సంగతి" అంటూ గుబక్కున ఆగి కాఫీగ్లాసు అందుకున్నాడు ఆదిశేషయ్య.

"నిజంగానా అన్నయ్యా?" అనుమానంగా దీర్ఘంతీసింది జానకమ్మ.

"దీంట్లో ఎటువంటి తిరకాసులేదు. పార్వతికి ఉద్యోగం వూడింది. శివుడు సమ్మెలో వున్నాడు. జీతపురాళ్ళు సరిగ్గా వస్తేనే ఈ బ్రతుకులు తెల్లారడం అంతంతమాత్రంగా వున్న కరువు రోజులు. ఆ రాళ్ళు కూడా లేకపోతే ఇక పస్తులేగతిమరి. అందులో హైదరాబాద్‌లో కాపురమంటే మాటలా? నీళ్ళతో కడుపునింపుకుందా మనుకున్నా పైసలు కావాలి" అని ఎత్తిపొడుస్తూ కాఫీ చప్పరించసాగాడు.

"వాళ్ళెంత పస్తులున్నా నీకేం లోటు చేయలేదుగా" బావమరిది వ్యంగం భరించలేక కోపంగా విసుక్కున్నాడు గరుడాచలం.

"ఏమాట కామాట చెప్పుకోవాలి. నాకేం తక్కువ చేయలేదు నీ కొడుకూ కోడలు. రాకరాక హైదరాబాద్ వచ్చానని, బంగాళదుంపల వేపుడూ, కొబ్బరి పచ్చడీ, పప్పుపులుసు, గెడ్డపెరుగుతో నాకు కమ్మటి భోజనంపెట్టారు. మరి వాళ్ళేమో తోటకూర పులుసు నంజుకుంటూ ఒకే ఒక చపాతి తిని మజ్జిగతేట తాగి 'బ్రేవ్'మని తేన్చారు. వాళ్ళ నటనకి నా కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. నోటమాటరాలేదంటే నమ్ము బావా!"

"నమ్మక చస్తానా? పీకలదాకా మెక్కిన నీకు గొంతు పెగిలివుండదు. అయినా వాడేం పరాయివాడా? నీ మేనల్లుడేగా.... మేఘింకా చావలేదని, పంతాలకిపోయి పస్తులుండటం మంచిదికాదని, వాడిని మందలించలేదా" కసిరినట్లు విసుక్కున్నాడు గరుడాచలం.

"వాడికి నచ్చచెప్పే ఓపిక నాకెక్కడుంది? ఆ రోజు పగలంతా హైకోర్టుపనిచూసుకుని ఉసూరుమంటూ శివుడి కొంపకి చేరేసరికి చీకటిపడింది. తీరా యింట్లోకి పోయిచూద్దునుగదా –" గబుక్కున ఆగి వక్కపొడి అందుకున్నాడు ఆదిశేషయ్య.

"ఇల్లంతా బోసిగావుందా?" చురుగ్గా అన్న జానకమ్మ మనస్సేదో కీడు శంకిస్తున్నది.

"లేదు. కొనడానికి బోలెడంత ధరపలికే, టి. వీ, ఫ్రిజ్, వి. సి. ఆర్, టు – యిన్ – వన్, ఎయిర్‌కూలర్ వగైరాలు అమ్మకానికి పెడితే తూకానికి కొంటామంటారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవని వూరికే అన్నారా? అందుకే ఆ ఇల్లు నిండుగా, షోగ్గావుంది. శివ పార్వతులు మాత్రం చింతాకు ముఖాలతో వోల్టేజి తగ్గిన దీపాల్లా డిమ్ముగావున్నారు. నన్ను చూడగానే ముఖాలకి నవ్వు పులుముకుని ఆప్యాయత వొలకపోశారు. మాటల సందర్భంలో వాళ్ళిద్దరికీ ఉద్యోగాలు లేవని, ఆర్థిక యిబ్బందుల్లోవున్నట్లు పసిగట్టాను. వాళ్ళూ గుట్టుగానే వున్నారు. కాసేపు అదీ ఇదీ మాట్లాడి, ఇప్పుడేవస్తానంటూ, సంచీ తీసుకుని, బయట కెళ్ళాడు శివుడు." అంటూ ఒక్కక్షణం ఆగి బిగ్గరగా శబ్దంచేస్తూ వక్కపొడినమలసాగాడు.

"అతిథి దేవోభవః అని ఏడ్చే దేశంలో పుట్టినవారికి ఇటువంటి తిప్పలు తప్పవుమరి. తాను అసలు తిన్నా, తినకపోయినా తద్దినాలు తప్పవుగా" గడుసుగానే ఈసడించాడు గరుడాచలం.

"మా కోడలు కలుపుగోలుతనంగా వుంటుందా? మనలో కలిసిపోతుందా?" కుతూహలంగా అడిగింది జానకమ్మ.

గరుడాచలం, జానకమ్మల ఏకైకసంతానమే శివుడు. ఆ మేనల్లుడికి తన కూతుర్ని అంటగట్టాలని శతవిధాల ప్రయత్నించి విఫలుడైనాడు ఆదిశేషయ్య. కేవలం అధిక కట్నంకోసం పరాయి సంబంధాల కెగబడ్డాడు

గరుడాచలం.

హైదరాబాద్‌లో ఉద్యోగం వెలగబెడుతున్న శివుడు, పక్కింటి పార్వతిని ప్రేమించి పెళ్ళికి సిద్ధపడ్డాడు. ఆ కులాంతర, వర్ణాంతరవివాహానికి ససేమిరా అంగీకరించలేదు అతని తల్లి దండ్రులు. పైగా శాపనార్థాలు పెట్టారు. చస్తామని బెదిరించారు. అయినా పెద్దల ఆశిస్సులు లేకుండానే పెళ్ళిచేసుకున్నాడు శివుడు.

తమ మాట వినలేదని అలిగి కొడుకు యింటి గడపతొక్కలేదు గరుడాచలం, జానకమ్మ. పంతం బట్టిన శివుడు కూడా పెళ్ళయి పది నెలలుదాటినా తల్లి దండ్రుల దగ్గరకిరాలేదు.

"మీ కోడలు బహుగడుసు. ఇల్లుగడవడం కష్టంగావుందని నోటితో చెప్పలేదుగాని, గాస్ స్టవ్‌పై కునుకుదీస్తున్న పిల్లినితరిమింది. బాబయ్యగారూ.... వి. సి. ఆర్..లో ఇంగ్లీషు మూవీ మూగగా చూస్తారా? టి. వి. కథకి కాళ్ళు కదుపుతారా? రేడియోపాటకి తలూపుతారా? టేపరికార్డర్ సంస్కృత శ్లోకాలకి కునుకు దీస్తారా అంటూ గొప్పలకి పోయిందిగాని, తినడానికి యింట్లో ఏమిలేవని చెప్పలేదు. పైగా హాలీవుడ్ సినీ టాపిక్‌తో నన్ను వూదరగొట్టేసింది. అంతలో సరుకుల మూటతో వచ్చాడుశివుడు. వాడుమాత్రం తక్కువతిన్నాడా? మావయ్యా.... ఈ ఆయిల్ పెయింట్స్, పార్వతి వేసిందన్నాడేగాని, పొపు వేయడానికి యింట్లో నూనెలేదని చెప్పలేదు. ఈ డోర్‌కర్టెన్ పార్వతి అల్లిందన్నాడుగాని, పచ్చిమంచినీళ్ళతో కడుపునింపుకుంటున్నామని చెప్పలేదు. చివరికి ఎలాగైతేనేం నా వొక్కడికి వండిగా వడ్డించి, వాళ్ళేమో గుటకలుమింగారు".

# అపార్థం

అలాగే చెప్పిదే చెబుతూ, నా కూతుర్ని కాదన్నందుకు మీ అబ్బాయికి తిండే కరువయిందని, దెప్పిపొడుస్తూ తన అక్కసునంతా తీర్చుకుని వెళ్ళిపోయాడు ఆదిశేషయ్య.

ప్రశ్న గుర్తుల్లా మిగిలారు గరుడాచలం, జానకమ్మ. కొడుకు కడుపుకాలిపోతున్నదని వినగానే తల్లి పేగు తట్టుకోలేకపోయింది. చేజేతులా వంశాంకురాన్ని బలిచేయడానికి తండ్రిమనసు వెనకాడింది.

పూర్వపు పట్టుదలలకీ, పట్టింపులకి స్వస్తిపలికారా దంపతులు. కొడుకుతో రాజీకి సిద్ధపడ్డాడురు. కోడల్ని ఆదరించాలని నిశ్చయించుకున్నారు.

ఇక ఆలిశ్యంచేయలేదు. ఆర్థికంగా అనారోగ్య వంతుడైన కొడుకుని ఆదుకోవాలని హైదరాబాద్‌కి వచ్చారు గరుడాచలం, జానకమ్మ.

ఆనందాశ్రువులతో తల్లి దండ్రుల్ని ఇంట్లోకి ఆహ్వానించాడు శివుడు. అత్తమావల కాళ్ళపైపడి 'ఇన్నాళ్ళకి మాపై దయకలిగిందాని' కళ్ళు తుడుచుకుంది పార్వతి.

"నేనేం కసాయినికాదు. కార్మముక్క రాస్తే ఎం. ఓ. చేసేవాడిని. మీకీ కన్నీళ్ళు తప్పేవి. నేను సంపాదించేదీ, బ్రతికేది మీకోసమే...." అన్నాడు గరుడాచలం పశ్చాత్తాపంతో.

తండ్రిమాటలకి తెల్లబోయిన శివుడి పొట్ట నిమురుతూ "కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందిరా? నీ కిష్టమని సున్నుండలు తెచ్చాను. మొహమాట పడకురా అంతా మావయ్య చెప్పాడు" అంటూ ఆదిశేషయ్య వాగుడు వివరించింది జానకమ్మ.

అసలువిషయం అర్థమయిన శివుడు మందహాసవదనంతో అన్నాడు.

"పార్వతి లాంగ్‌లీవ్‌లో వుంది. నేను నాలుగు రోజులు సమ్మెలో వున్నాను. అయినా డబ్బుకీ, తిండికి మాకేం లోటులేదు. మాపర్సనాలిటీ చూస్తున్నారుగా? గత పదినెలలుగా బాగా తినితిని దున్నపోతుల్లా బలిశాం. బాగా వొళ్ళుచేశాం. మా శరీరాన్ని మేమే మోసుకోలేని దుస్థితికి వచ్చాం. ఇక లాభంలేదని, సన్నగా, ట్రిమ్‌గా తయారుకావడానికి డైటింగ్‌చేస్తున్నాం. నోరు కుట్టేసుకుని అర్థాకలితో వుంటున్నాం. ఆ రోజు మావయ్య వచ్చేటైంకి, ఎక్సర్‌సైజస్ చేసి మేం బాగా అలిసివున్నాం. మమ్మల్ని అపార్థంచేసుకున్నాడు మావయ్య. అసలు విషయం తెలిస్తే మావయ్య అటలుపట్టిస్తాడని, ఆకలి లేదంటూ చపాతి తిన్నాం. మేం కష్టాల్లో వున్నామని ఆయన అపోహపడ్డాడు. అంతా మనమంచికే జరిగింది. ఆయన పుణ్యమాని మనం కలుసుకున్నాం. ఇక శుభంమరి". □


విడుదలయింది!

మంచి నవలకోసం దాహంగొన్న పాఠకులకు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

తాజానవల

వినాయకరావుపెళ్ళి

వెల: రూ-27/-



నవసాహితిబుక్‌హౌస్

ఏలూర్‌రోడ్ - విజయవాడ-520002.

ఆర్డరుతోపాటు అడ్వాన్సు పంపండి!

TO WIN FREE SINGAPORE TRIP TICKETS

BUY TODAY

CARTOONS PARADISE

Rs. 20/-

& ENTER EASY QUIZ CONTEST

HURRY: LAST DATE 30-10-88

FOR COPIES & AGENCY TERMS

Contact:

Fun Fare Publications

29, Pillaiyar Koil St, VADAPALANI, MADRAS – 600 026

PHONE 427444

CONCESSION TO STUDENTS

CONSOLATION PRIZES TO ALL